# కల్తీ

వారాల కృష్ణమూర్తి

'కల్తీ నశించాలి !' అన్నారు రాజధాని విద్యార్థులు.

'కల్తీ !' ఒక గొంతుక చించుకుంది.

'నశించాలి!' వేలగొంతుకలు ఒక్కటై ధ్వనించాయి.

కల్తీ...ఎక్కడచూసినా కల్తీ, తినే తిండి గింజల్లో కల్తీ, కట్టే గుడ్డల్లో కల్తీ, కట్టే ఇళ్ళల్లో (సిమెంటు) కల్తీ, ఉండే సంఘంలో కల్తీ, సంఘంలోని మనుషులు కల్తీ. తల్లి ప్రేమలో కల్తీ, బిడ్డ ప్రేమలో కల్తీ, భార్యా భర్తల అనుబంధంలో కల్తీ, అన్నదమ్ముల ఆప్యాయితలో కల్తీ, రోగాలకు ఇచ్చే మందుల్లో కల్తీ, చివరకు మనం త్రాగే నీళ్ళలోనూ, పీల్చే గాలిలోనూ కల్తీఏ. ఎటుచూస్తే అటు కల్తీ మనం కల్తీ యుగంలో ఉన్నాం. కల్తీ నశించాలి అని గోలపెడుతున్న ప్రభుత్వమూ కల్తీమే ! ఈ కల్తీని రూపుమాపాలని కల్తీ నశించాలని గోలపెడుతున్నారు. భావిభారత పౌరులు.

ఎవరూ పట్టించుకోని ఈకల్తీని విద్యార్థులు పట్టించుకొని వీధుల్లో పడ్డారు చదువు కోండని బళ్ళకు పంపితే వీధుల్లో పడ్డారేమని తల్లిదండ్రులు కోప్పడలేదు. పైపెచ్చు గర్వపడ్డారు తాము చెయ్యలేని పనిని వాళ్ళు చేస్తున్నందుకు అవకాశవాద పార్టీలు ప్రతిపక్షపార్టీలు, ఈ అవకాశాన్ని తమవైపు తిప్పుకుందుకు విద్యార్థులతో చేతులు కలిపారు. అధికార పార్టీ చేత కాని తనాన్ని కాళ్ళెత్తి చూపారు.

ప్రతిపక్షాల నాయకత్వంలో ఈ అలజడి జరుగుతున్నదనే మిషలో అధికార వర్గం వీధుల్లో పడ్డ విద్యార్థుల్ని లెక్కచేసింది కాదు. లెక్కచెయ్యని పెద్దల్ని రెక్కపట్టి దించాలనే పట్టుదల ప్రతి పక్ష పెద్దలకు పుట్టింది. పుట్టిన ఆలోచనలకు ఆసరాగ పుట్టలు పుట్టలు విద్యార్థులు.

పామును చూస్తే కప్పలకు భయం, పిల్లిని చూస్తే ఎలుకలకు భయం, పులినిచూస్తే చిన్న జీవాలకు భయం వేటగాడిని చూస్తే పులికి భయం. అమెరికాకు రష్యా అంటే భయం. రష్యాకు చైనా అంటే భయం. మన నాయకులకు విద్యార్థుల్ని చూస్తే భయం. చక్కగా చదువుకోవాల్సిన కుర్రకారు కార్ల మీద బస్సుల మీద పడతారు. రాళ్ళేస్తారు, పెట్రోలు పోస్తారు నిప్పు కురిపిస్తారు. వాళ్ళు ఎందుకు చేస్తారో చేస్తున్నారో వాళ్ళకె తెలీదంటారు నాయకులు మేమింత చేస్తున్నా నాయకులు దిగిరా లేదంటారు విద్యార్థులు.

కల్తీని సమూలంగా నాశనం చేసేంత వరకూ ఈ పోరాటం ఆగదన్నారు విద్యార్థులు, ప్రభుత్వం సత్వర చర్యలుగా బ్లాక్ మార్కెట్ దారులకు ఇతర వ్యాపారస్తులకు కల్తీ చేస్తే ఖూనీకేసుతో సమానంగా శిక్షించాల్సి వస్తుదని హెచ్చరించారు. అయినా విద్యార్థి లోకం శాంతించలేదు. ''హర్తాళ్'' ప్రకటించారు.

హర్తాళ్!...హర్తాళ్...ఎక్కడ విన్నా హర్తాళ్ గురించే...గోడలన్నింటిమీద హర్తాళ్ చోటు చేసు

కొంది. ఆ రోజు వీధుల్లో జనసంచారం లేదు. ఏ ఒక్క షాపు తెరవలేదు. ఏ రిక్షా కదిలించికారు. ఏ ప్రభుత్వ కార్యాలయము సరిగా పనిచేసింది కాదు. అయినా మూడు బస్సులు తగలబడ్డాయి. రైల్వే స్టేషన్ శిథిలమైపోయింది.

ఇహ లాభం లేదని పోలీసుల్ని రంగంలోనికి దించింది ప్రభుత్వం. పోలీసులు ఉత్సాహంతో ఉరకలు వేశారు. 'ఒన్‌షార్టీ ఫోర్ సెక్షన్' అన్నారు లాభంలేదని...కర్ఫ్యూ అన్నారు ... తప్పదని "ఫైరింగ్" అన్నారు. ఫలితం నలుగురు మరణించారు, పదిమంది గాయపడ్డారు. గాయపడ్డవాళ్ళలో ఇద్దరి పరిస్థితి సీరియస్. జనం రెచ్చిపోయారు. ప్రదర్శనలు సమావేశాలు ఏర్పాటు చేసారు. జుడిషియల్ ఎన్‌క్వైరీ కావాలన్నారు. అలసిపోయిన అధికార పక్షం నాయకులు "సరే" జుడీషియల్ ఎన్‌క్వయిరీ జరిపిస్తాం అన్నారు.

వాతావరణం చల్లబడిందని ఆకాశవాణి మీటినట్లు ...కింది.

○ ○ ○ ○

ప్రస్తుతం జుడీషియల్ ఎన్‌క్వయిరీ సంగతి మనకు అప్రస్తుతం అసలు విద్యార్థులు కత్తి నశించాలి అని వీధిన ఎందుకు పడ్డారో ఎన్‌క్వయిరీ చేద్దాం. ఇందులో విప్లవకారుల పాత్ర వుందా ?... లేక విదేశీ ఏజంట్ల హస్తం వుందా?...అనేది తేలాలి, మళ్ళీ ఇలాంటి ఉపద్రవాలు రావచ్చు. వాటిని ఎదుర్కోవాలంటే వాటి పుట్టు కెక్కడో గుర్తించి మొక్కలోనే తుంచేయాలి. కాబట్టి పై వివరాలు సవివరంగా మాకు అంద చేయాలని స్పెషల్ బ్రాంచ్‌కు ప్రభుత్వం ఆదేశించింది.

స్పెషల్ బ్రాంచి ఆఫీసర్లు తలలు బద్దలు కొట్టుకున్నా విద్యార్థులు కత్తి గురించి ఎందుకు ఆందోళన చేశారో అర్థమయింది కాదు. ప్రతి పక్షాల వారి దగ్గర ఆరా తీసినా, అవకాశాల్ని వాడుకోవడం తప్పితే సమస్య ఎలా తలెత్తిందన్నది వాళ్ళకూ తెలియదని విద్యార్థుల హృదయం వాళ్ళకూ అంతు చిక్కలేదని, తెలుసుకున్నారు. లాట్ ఇహ లాభం లేదని ఒక స్పెషల్ బ్రాంచి భక్తుడు తను నమ్మిన బాబాగారిని ప్రశ్నించగా వారు చిన్మయానందంతో అంతా భగవంతుని లీల, శివునిఆజ్ఞఅయినట్లున్నది. అట్లు జరిగినది అని శలవిచ్చిరి. భక్తాగ్రేసరుడు అజ్ఞానిగా వున్న శివ చిత్తం ఎరుగడాయమ. యువ చిత్తం ఎమిటో తెలుసుకోవాలంటే యువకుల్ని కలుసుకోవాలని ఆ స్పెషల్ బ్రాంచి భక్తుడు కొందరి విద్యార్థుల్ని మచ్చిక చేసుకుని వారి నుండి అసలు విషయం గ్రహించి ప్రభుత్వమునకు ఈ క్రింది విధముగ అందచేసిరి.

విషయం :- విద్యార్థుల కత్తి సమ్మె దాని పుట్టుక; విద్యార్థులు నిజంగానే కత్తి పీడితులైనందున ఈ ఆందోళన లేవదీశారు. ఇందులో విప్లవ కారుల హస్తం ప్రత్యక్షగానూ, పరోక్షగాను కానరాదు. విదేశి ఏజంట్ల ప్రమేయము, ప్రవేశమూ ఇందులో లేవనే చెప్పవచ్చు. అమాయకులైన విద్యార్థులు, మన భావి విధాతలు_ మన పిల్లలు కత్తి బాధకు తాళలేక భవిష్యత్ శూన్యంగా కనిపిస్తుంటే మరే మార్గమూ లేక వీధిన పడ్డారు. ఆవైన మెట్టిదన...ఆరోజు...

రాత్రి పది గంటలకు రాజధాని విద్యార్థులలో చాలా మంది నారాయణగూడా వై.యం.సి.ఏ దగ్గర సమావేశమయ్యారు. అందరిలోనూ ఏదో ఆతృత, ఆరాటం నిరీక్షణ. సిగరెట్ కాల్చేవాళ్ళు సిగరెట్లు కాలుస్తున్నారు.

కిళ్ళీలు తినేవాళ్ళు యాంత్రికంగా నములుతూ వూస్తూ... నములుతూ వున్నారు. పళ్లీలు తినేవాళ్ళు చిల్లరడబ్బులు విరజిమ్ముతున్నారు. అలా ఎంతో దీక్షగా పన్నెండు దాటినా అక్కడనుంచి ఒక్కడూ కదల్లేదు. ఆ ఆరాటం అలాటిది. వాళ్ళలా రెండు వరకూ వున్నారు. నగరం నిద్రావస్థలోనికి జారుకున్నా అక్కడున్న విద్యార్థులు కళ్ళల్లో వత్తులు వేసుకుని నిరీక్షిస్తూనే వున్నారు. దాదాపు ఆ రాత్రి మూడు గంటలకు వాళ్ళ నిరీక్షణ ఫలించింది. ఎక్కడి నుండో ఓ సైకిల్ మోటర్ మీద ఇద్దరు విద్యార్థులు వచ్చారు. వాళ్ళు వస్తూనే కాచుక్కూర్చున్న వాళ్ళలో ఉత్సహం పెరిగింది. అంతా వారిచుట్టూ మూగారు.

'అంతా రాసుకోండి;' అన్నాడు మోటర్ సైకిల్ మీద వచ్చిన వాళ్ళలో ఒకడు. చుట్టూ చేరిన విద్యార్థులు జేబుల్లోని పేపరు పెన్‌లను తీసి, అతను చెప్పిందంతా వ్రాసుకున్నారు. మళ్ళీ ఓ సారి తాము రాసుకుంది కరక్టోకాదో అనుమానం నివృత్తి చేసుకొను మళ్ళీ అతన్ని చదవమని చూసుకున్నారు. అందరూ మోస్తున్న బరువును దింపుకున్నట్లు హమ్మయ్య అనుకున్నారు.

సైకిల్ మోటర్ తుర్‌మంది. తెల్లవారి పదిగంటలకు పరీక్ష. ఇప్పుడు మూడున్నర...ఓ...చాలు...చాలు ఈ సమయం అనుకున్నారు.

అలా రెండు రోజులు వాళ్ళు పరీక్షలకు తాపీగానే వెళ్ళి రాశారు. మూడవ రోజు బెడిసింది.

క్రితం రాత్రి బైటకు వచ్చిన పేపర్ వేరు, పరీక్ష హాలులో అందిన పేపరు వేరు, ఔట్ అయిన పేపర్‌లోని ఒక్క ప్రశ్నా పరీక్షహాలులో అందిన పేపర్‌లో రాలేదు. కొన్ని గంటల్లోనే ఇంత కల్తీ జరగడమా... అని చకితులై పోయారు. అయిదు నిమిషాలు తేరుకోలేక పోయారు.

'కల్తీ నశించాలి!...' అన్నాడో విద్యార్థి అంతా అటు చూశారు.

'విద్యార్థి సోదరులారా, మనం ఈ కల్తీని నిరోధించాలి. లేకపోతే మనకు మనుగడలేదు. పదండి...' అంటూ ఠివ్వున హాలు బైటకు వచ్చాడు. అతని వెనకే మరి కొంత మంది వచ్చారు. బైటపడ్డ వాళ్ళంత లోని వాళ్ళను పరీక్ష రాయనీకుండా రాళ్ళురువ్వారు. వ్యవహారం అదుపు తప్పింది. అదుపు తప్పిన విద్యార్థులు గతిలేక వీధిన పడ్డారు.

ప్రేమించే ప్రతి వాడికి
మరణించడం తెలిసుండాలి.
నిస్సహాయత నిప్పులాంటిది
చెలగాటమాడితే జ్వాలై లేస్తుంది.